కవర్ స్టోరీ



# ఉద్యమ బాటలో... పోటెత్తిన పాట

'సేను బాయె.. సెలక బాయె..పండుగ పబ్బాలు బాయె.. ఊట బాయె.. మోట బాయె.. కొలువు బాయె.. బతుకు బాయె.. ఈ ఆంధ్ర వలస పాలనలో రాజన ఓ రాజన.. తెలంగాణ ఆగమాయె రాజన ఓ రాజన' అంటూ పాడుకుంట ఏడ్వని పల్లె లేదు పాతికేండ్లకు ముందు. వలసపోయిన బిడ్డల కోసం పాక్కిలైన వాకిళ్లలో కాటికి కాళ్లుజాపుకొని ఎదురుచూస్తున్న తల్లులకు 'ఎట్లున్నవే నా పల్లె' అనే పలుకరింపు పాట వినబడ్డది. 'పాడుదాం తెలంగాణ పాట పాడుదాం.. ప్రజల కొరకు గజ్జె కట్టి ఆటలాడుదాం' అంటూ కైగట్టి పాడేటి పాటగాళ్లని, ఆడేటోళ్లని బిడ్డ లెక్క సాదుకుంది తెలంగాణ పల్లె తల్లి. 'మా ఆకలి కేకలే తెలంగాణ పిలుపులై.. రాష్ట్రమొచ్చే దాక ఇక ఆగవు పొలికేకలే' అంటున్న పాటకు బువ్వ పెట్టి హారతి పట్టింది. 'అసోయ్ దూల హారతి కాళ్ల గజ్జెల గమ్మతి.. తెలంగాణ లడాయికి కదులుతున్న ఇమ్మతి' అనుకుంట సాగిన పోరాటం పల్లెపల్లెనా కండ్లవడ్డది. కేసీఆర్ రాక.. తెలంగాణ కాక.. ఇగ పాట ఊపందుకుంది. 'ఎనకముందు జూసుడేంది రాజన ఓ రాజన.. ఎత్తుకో తెలంగాణ జెండ రాజన ఓ రాజన' అంటూ పాట ధిక్కారమై ప్రతిధ్వనించింది. 'అయ్యోనివా నువ్వు అవ్వోనివా' అంటూ నిలదీసి అడిగింది. 'వెయ్ రా తెలంగాణ దరువెయ్‌రా' అంటూ దండుకట్టనీకి దండోరా వేసింది. 'వీరులారా వందనం', 'పుడితొక్కటి, చస్తె రెండు.. రాజన ఓ రాజన' ఇలా ఒకటి రెండు కాదు.. వందలు వేల పాటలు.. తెలంగాణ వచ్చేదాక పోరాటంతో జత కట్టినయి! తెలంగాణ కోసమే పుట్టిన పార్టీకి పాతికేండ్లయిన సందర్భంగా ఆనాటి పాటని, ఆటనీ మల్లా తల్సుకుందాం!

... అంబటి వెంకన్న